బుమ్రా నం.1

టెస్టుల్లో టాప్‌ర్యాంక్‌లోకి

తొలి భారత పేసర్‌గా రికార్డు

ఇంగ్లండ్‌తో టెస్టుల్లో అదుర్స్

భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కొత్త చరిత్ర లిఖించాడు. సుదీర్ఘ దేశ క్రికెట్‌లో ఇన్నాళ్లు ఎవరికీ సాధ్యం కాని రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఘనత సాధించిన తొలి భారత పేసర్‌గా అరుదైన ఫీట్ అందుకున్నాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో వికెట్లు వేట కొనసాగిస్తున్న బుమ్రా తాజా ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌లోకి దూసుకెళ్లాడు. వైవిధ్యమైన యాక్షన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు సింహస్వప్నంలా నిలుస్తున్న ఈ స్వింగ్‌కింగ్ రానున్న రోజుల్లో మరిన్ని రికార్డులు కొల్లగొట్టడం ఖాయంగా కనిపిస్తున్నది.



బుమ్రా టెస్టు కెరీర్

మ్యాచ్‌లు	34
ఇన్నింగ్స్	65
వికెట్లు	155
అత్యుత్తమం	6/19
సగటు	20.19
ఎకానమీ	2.71
ఐదు వికెట్ల ప్రదర్శన	10

4

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న నాలుగో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. గతంలో బిషాన్‌సింగ్ బేడీ, అశ్విన్, జడేజా ఈ ఫీట్ అందుకున్నారు.

దుబాయ్: భారత పేస్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా..టెస్టుల్లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అధిరోహించాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో బుమ్రా 881 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోకి దూసుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో విశాఖపట్నంలో జరిగిన రెండో టెస్టులో తొమ్మిది వికెట్లతో కదం తొక్కిన ఈ యువ పేసర్..ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ఈ క్రమంలో కగిసో రబడ (851), అశ్విన్ (841), కమిన్స్(828)ను అధిగమిస్తూ కెరీర్‌లో తొలిసారి నంబర్‌వన్‌లో నిలిచాడు. ఈ క్రమంలో అశ్విన్, జడేజా, బిషాన్‌సింగ్ బేడీ సరసన నిలిచాడు. అయితే గతంలో భారత్ నుంచి పేసర్లు కపిల్‌దేవ్(1979-1980) రెండో ర్యాంక్‌లో, జహీర్‌ఖాన్(2010) మూడో ర్యాంక్‌లో నిలువడమే ఇప్పటి వరకు అత్యుత్తమం కాగా బుమ్రా కొత్త రికార్డు నెలకొల్పాడు. వైజాగ్ టెస్టులో తనదైన స్వింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కకావికలు చేయడంలో బుమ్రా కీలకంగా వ్యవహరించాడు. రివర్స్ స్వింగ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

యశస్వి @ 29

బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే..ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో డబుల్ సెంచరీతో విజృంభించిన యశస్వి జైస్వాల్ ఏకంగా 37 ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 29వ ర్యాంక్‌లో నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన శుభ్‌మన్ గిల్ 14 ర్యాంక్‌ల మెరుగుతో కెరీర్‌లో అత్యుత్తమంగా 38వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత్ నుంచి టాప్-10లో విరాట్ కోహ్లీ (7) ఒక్కడే కొనసాగుతున్నాడు. రిషబ్ పంత్, రోహిత్‌శర్మ వరుసగా 12, 13 ర్యాంక్‌ల్లో ఉండగా, కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా, అశ్విన్ తొలి రెండు ర్యాంక్‌ల్లో ఉన్నారు.

బుమ్రా భేష్: డివిలీయర్స్

చెన్నై: టీమ్‌ఇండియా పేసర్ బుమ్రాపై దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం డివిలీయర్స్ ప్రశంసలు కురిపించాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో అద్భుత ప్రదర్శన ద్వారా మిగతా భారత బౌలర్లను బుమ్రా దాటేశాడని డివిలీయర్స్ పేర్కొన్నాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బుమ్రా నంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకోవడంపై ఏబీ స్పందిస్తూ 'బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. వాట్ ఏ బౌలర్! స్వింగ్ నైపుణ్యంతో మిగతా భారత బౌలర్లను అతను అధిగమించాడు. బుమ్రా అమ్ములపొదిలో యార్కర్ ప్రధాన అస్త్రం. యార్కర్లతో అతను ఇప్పటి వరకు టెస్టుల్లో చాలా వికెట్లు తీశాడు. గిల్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో సత్తాచూపించాడు' అని అన్నాడు.

సిరీస్‌కు కోహ్లీ దూరం!

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్టు మ్యాచ్‌లకు టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ అందుబాటులో ఉండే అవకాశాలు కనిపించడం లేదు. వ్యక్తిగత కారణాలతో ఇప్పటికే తొలి రెండు టెస్టులకు దూరమైన కోహ్లీ ఈ నెల 15నుంచి రాజ్‌కోట్‌లో మొదలయ్యే మూడో టెస్టుతో పాటు రాంచీలో జరిగే నాలుగో టెస్టుకు జట్టులోకి వచ్చే అవకాశాలు లేనట్లు తెలిసింది. ఈ విషయాన్ని బీసీసీఐ వర్గాలు బుధవారం పేర్కొన్నాయి. అయితే ధర్మశాలలో మార్చి 7నుంచి మొదలయ్యే ఆఖరి టెస్టుకైనా కోహ్లీ అందుబాటులో ఉంటాడా అన్నది అనుమానంగా మారింది. కోహ్లీ, అనుష్క రెండో సంతానం కోసం ఎదురుచూస్తున్నట్లు దక్షిణాఫ్రికామాజీ కెప్టెన్ ఏబీ డివిలీయర్స్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

క్వార్టర్స్‌లో అమిత్, ఆకాశ్

సోఫియా(బల్గేరియా): ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్లు అమిత్ పంగల్, ఆకాశ్, అభిమన్యు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన పురుషుల 51కిలోల ప్రిక్వార్టర్స్ పోరులో అమిత్ 5-0తో రుడీ మైక్‌పై విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన అమిత్.. తన అనుభవాన్నంత కూడదీసుకుంటూ ప్రత్యర్థిపై విరుచుకుపడ్డాడు. తొలి రెండు రౌండ్ల లో ఆధిపత్యం ప్రదర్శించిన అమిత్‌కు ఆఖరిదైన మూడో రౌండ్‌లో ప్రతిఘటన ఎదురైంది. పురుషుల 71కిలోల బౌట్‌లో ఆకాశ్, 80కిలోల బౌట్‌లో అభిమన్యు గెలిచి టోర్నీలో ముందంజ వేశారు.

ఎస్ఏ టీ20 ఫైనల్లో రైజర్స్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా(ఎస్ఏ) టీ20 లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 51 పరుగుల తేడాతో డర్బన్ సూపర్‌జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. రైజర్స్ నిర్దేశించిన 158 పరుగుల లక్ష్యఛేదనలో జెయింట్స్ 19.3 ఓవర్లలో 106 పరుగులకు కుప్పకూలింది.

ఐపీఎల్‌కు పంత్ సిద్ధం

మెల్‌బోర్న్: కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇన్నాళ్లు క్రికెట్‌కు దూరమైన రిషబ్ పంత్..రానున్న ఐపీఎల్‌కు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండబోతున్నాడు. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ చీఫ్ కోచ్ పాంటింగ్ బుధవారం పేర్కొన్నాడు. 'ఢిల్లీ తరపున వచ్చే సీజన్‌లో బరిలోకి దిగేందుకు పంత్ సిద్ధంగా ఉన్నాడు. అతను ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నాడు. ఏ బాధ్యతలో ఆడుతాడన్నది ఇంకా తెలియదు' అని అన్నాడు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు షురూ

33 జిల్లాల నుంచి 600 మంది ప్లేయర్లు

హనుమకొండ చౌరస్తా: తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-15, అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ బుధవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం(జేఎన్ఎస్)లో నిర్వహిస్తున్న పోటీల్లో రాష్ట్రంలోని 33జిల్లాల నుంచి 600మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగిన క్రీడాకారులు ప్రత్యర్థిని ఓడించడంలో ఎత్తుకుపైఎత్తులు వేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన రెజ్లింగ్ క్రీడలో తెలంగాణ కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో ఇనుమడింపజేయాలన్నారు. తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తూమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరీం మాట్లాడుతూ పోటీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

గచ్చిబౌలి వేదికగా జరిగిన జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన ప్లేయర్లు. బాలికల అండర్-8ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో శ్రీయా స్వర్ణ పతకంతో మెరిసింది. అనిక (స్వర్ణం), కావ్య (స్వర్ణం, రజతం), అర్హ చౌహాన్ 2 రజతాలు) దక్కించుకున్నారు.

కివీస్‌దే తొలి టెస్టు

దక్షిణాఫ్రికాపై ఘన విజయం

మౌంట్ మౌంగనుయి: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ 281 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 529 పరుగుల లక్ష్యఛేదనలో సఫారీలు 247 పరుగులకే పరిమితమయ్యారు. కైల్ జేమీసన్(4/58), సాంట్నర్(3/59) ధాటికి సఫారీ బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. డేవిడ్ బెడింగ్‌హామ్(87), జుబైర్ హమ్జా(36) మినహా అందరూ స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. సొంతగడ్డపై పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ కివీస్ బౌలర్లు ఆది నుంచే చెలరేగడంతో దక్షిణాఫ్రికా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 179/4 వద్దే రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన కివీస్..సఫారీలకు భారీ సవాలు విసిరింది. డబుల్ సెంచరీతో విజృంభించిన రచిన్ రవీంద్రకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మంగళవారం నుంచి మొదలుకానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.